www.prajasakti.com

ప్రజాశక్తి



28న రాజ్యసభ సభ్యునిగా పాకా ప్రమాణ స్వీకారం



ప్రజాశక్తి - భీమవరం

బిజెపి తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన భీమవరం ప్రాంతానికి చెందిన పాకా వెంకట సత్యనారాయణ ఈ నెల 28న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12.30 గంటల తరువాత ఉప రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు సత్యనారాయణ తెలిపారు. కేవలం 10 మందికి మాత్రమే ప్రమాణ స్వీకారానికి అనుమతించారని చెప్పారు. స్థానిక బిజెపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

రైతులు ఓడారు.. కంపెనీలు గెలిచాయి..!



మాట్లాడుతున్న మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారధి

- అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకోకు ధర ఇచ్చేది లేదన్న కంపెనీలు
- ప్రస్తుతం కిలో రూ.880 ఉంటే రూ.450నే ఇస్తామంటే సరేనన్న మంత్రులు
- ప్రభుత్వం రూ.50 ఇస్తుందని, కిలో రూ.500కు కొనుగోలు చేస్తారని ముగింపు
- చర్చలు విఫలమయ్యాయని ఆందోళనకు దిగిన కోకో రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోకో ధర విషయంలో జరిగిన చర్చల్లో రైతులు ఓటమి చెందగా, కంపెనీలు తమ పంతాన్ని నెగ్గించుకున్నాయి. దీంతో తమకు అన్యాయం జరిగిందని కోకో రైతులు ఆందోళనకు దిగారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో శుక్రవారం కోకో రైతుల సమస్యలపై రైతులు, అధికారులు, ట్రేడర్లు, కంపెనీల ప్రతినిధులతో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో జిల్లా మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర, జిల్లా అధికారులు, ఎంఎల్‌ఎలు పాల్గొన్నారు. ముందుగా రైతులు బోళ్ల వెంకటసుబ్బారావు, ఉప్పల కాశీ, గోపాలకృష్ణ, ఇంటెలిజెన్స్ మాజీ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, కోకో రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. 2024 వరకూ ఇచ్చినట్లుగా అంతర్జాతీయ ధర ఇప్పించాలని కోరారు. ట్రేడర్లు మాట్లాడుతూ కంపెనీలు ఇచ్చిన ధర ప్రకారమే తాము కొనుగోలు చేస్తామన్నారు. ఈ సమావేశానికి కంపెనీ ప్రతినిధులు హాజరు కాకపోవడం గమనార్హం. దీంతో చేసేదేమీ లేక ఆన్‌లైన్‌లో మాండలీజ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రులు మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో ధర రూ.880 ఉన్నప్పటికీ తాము రూ.450కు మించి కొనుగోలు చేయలేమని కంపెనీ ప్రతినిధులు తెగేసి చెప్పారు. ఆ ధరతో తాము నష్టపోతామని, అంతర్జాతీయ ధర ప్రకారమే ధర చెల్లించాలని రైతులు కోరారు. మంత్రులు మెజార్టీ రైతుల మాటలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఒకరిద్దరు మాట్లాడిన రైతుల మాటలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుతం ఉన్న పంట కొనుగోలు జరిగిపోవాలని చెబుతూ కంపెనీలు కిలోకు రూ.450 ఇస్తాయని, ప్రభుత్వం రూ.50 చెల్లిస్తుందని, మొత్తంగా కిలో రూ.500కు కొనుగోలు చేస్తారని మంత్రులు చర్చలు ముగించారు. ఇంకా 1500 టన్నుల వరకూ పంట ఉందని, మొత్తం కొనుగోలు చేయాలని కంపెనీలకు చెప్పారు. దీనిపై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇంత పెద్దఎత్తున సమావేశం ఏర్పాటు చేసి ఏం న్యాయం చేశారని రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

కోకో ధరకు ప్రత్యేక చట్టం తెస్తాం

ఆయిల్‌పామ్ తరహాలో కోకో పంటకు మద్దతు ధర అందేలా కొత్త చట్టాన్ని తెస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. చర్చల అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. గత సంవత్సరం వరకు కోకో పంటకు రైతులకు లాభదాయకమైన ధరను సదరు ట్రేడర్లు, కంపెనీలు అందించాయని, ప్రస్తుతం రైతులను ఇబ్బంది పెట్టేలా ట్రేడర్లు, కంపెనీలు కోకో ధరను తగ్గించి కొంటున్నాయని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. కోకో రైతులకు భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా కనీస మద్దతు ధర అందించేందుకు కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు, ట్రేడర్లకు నష్టం కలగని రీతిలో చట్టం రూపకల్పనకు రైతులు, రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రైతుల వద్ద వెయ్యి నుండి 1500 టన్నుల వరకు ఉన్న కోకో పంటను కిలోకు రూ.500 చొప్పున కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కోకో పంటకు గతేడాది ధరకు ప్రస్తుతానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. కోకో ధర నిర్ణయించేందుకు ఆయా కంపెనీలు నిర్దిష్ట విధానాన్ని అనుసరించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాస్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు బడేటి రాధాకృష్ణయ్య, కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, ఉద్యాన శాఖ డిడి ఎస్.రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ భాషా, వివిధ రైతుసంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చర్చలు విఫలం

కలెక్టరేట్ ఎదుట కోకో రైతుల ధర్నా

కోకో గింజల కొనుగోలు ధరపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ద్వైపాక్షిక చర్చలు పూర్తిగా విఫలమైనట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా మోసగిస్తున్న మోండలీజ్ కంపెనీ, ఇతర బహుళ జాతి కంపెనీల మోసాలకు నిరసనగా, రాష్ట్ర ప్రభుత్వ తీరును పూర్తిగా వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట కోకో రైతులు ధర్నా నిర్వహించారు. ఏపి కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు నెలలుగా కోకో రైతులు పెద్దఎత్తున పోరాటం చేస్తున్నారని, వారం రోజులుగా పోరాటాన్ని ఉధృతం చేశారని చెప్పారు. మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, ఎంఎల్‌ఎలు, రాష్ట్ర ఉన్నతాధికారుల సమక్షంలో జరిపిన చర్చలకు భౌతికంగా రాకుండా మోండలీజ్ కంపెనీ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది కంపెనీల లెక్కలేనితనమని విమర్శించారు. కిలో ధర రూ.450కు మించి ధర ఇవ్వలేమని చెప్పడం దుర్మార్గమని, ఇది బహుళ జాతి కంపెనీల కుట్రలో భాగమని విమర్శించారు. మరో రూ.50 కంపెనీకి ఇచ్చి రూ.500కు కొనుగోలు చేస్తామని మంత్రులు ప్రకటించిన నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ల వెంకట సుబ్బారావు, ఉప్పుగంటి భాస్కరరావు, పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుడిబండి వీరారెడ్డి, ఉప్పల కాశీ, కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, నాయకులు కోసరు సతీష-బాబు, ఎపి రైతుసంఘం నాయకులు చింతకాయల బాబూరావు పాల్గొన్నారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కోకో రైతులు, నేతలు

ఎకో జోన్ నిర్ధారణ విజ్ఞాపనలను పరిశీలించాలి

జోన్ ఏర్పాటుపై కొల్లేరువాసులకు అవగాహన కల్పించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

కొల్లేరు ఎకో జోన్ నిర్ధారణపై గ్రామసభల ద్వారా అందిన విజ్ఞాపనలను పరిశీలించి, సంబంధిత పరిధిలోని ప్రజలకు ఎకో జోన్ ఏర్పాటుపై అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎకో సెన్సిటివ్ జోన్ నిర్ధారణపై గ్రామసభల ద్వారా అందిన అభిప్రాయాలపై ఆయన సమీక్షించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొల్లేరు నుండి పది కిలోమీటర్ల వరకు ఇఎస్‌జెడ్ (ఎకో సెన్సిటివ్ జోన్) నిర్ధారించాల్సి ఉందన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోని ఐదు మండలాల్లోని 31 గ్రామాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన అర్జీలను పరిశీలించాలన్నారు. ఎకోజోన్ ఏర్పాటుపై వారి సందేహాలను నివృత్తి చేసి తిరిగి అభిప్రాయాలు స్వీకరించాలన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఎఫ్‌ఒ ఆశా కిరణ్, ఏలూరు వైల్డ్ లైఫ్ డిఎఫ్‌ఒ బి.విజయ, ఇన్‌ఛార్జి డిపిఒ వై.దోసిరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, జిల్లా మత్స్య శాఖాధికారి కెఎస్‌వి.నాగలింగాచార్యులు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కె.మురళీకృష్ణ, జిల్లా విద్యుత్ శాఖాధికారి ఎ.రఘునాథ్‌బాబు, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి కె.గంగాధర్‌రావు, డ్రైనేజీ శాఖ ఇఇ సి.హెచ్.సత్యనారాయణ, ఫారెస్ట్ రేంజ్ అధికారి కెవి.రామలింగాచార్యులు, ఆకివీడు, గణపవరం, కాళ్ల, ఉండి, పెంటపాడు మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

విద్యుదాఘాతంతో మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి మృతి

మృతదేహంతో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యుదాఘాతానికి గురై మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కుంచనపల్లికి చెందిన రాపాక అచ్చియ్య (30) మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికునిగా ఎల్‌క్ట్రికల్ విభాగంలో పని చేస్తున్నారు. స్థానిక కోడె వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్ సమీపంలో శుక్రవారం చెట్ల కొమ్మలు నరుకుతుండగా అచ్చియ్య విద్యుదాఘాతానికి గురయ్యారు. తోటి కార్మికులు హుటాహుటీన బాధితుడిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అచ్చియ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు కర్రి నాగేశ్వరరావు, ధనాల వెంకట్రావు, కార్మికులు, మృతుని కుటుంబీకులు, బంధుమిత్రులు, కుంచనపల్లివాసులు మృతదేహాన్ని మున్సిపల్ కార్యాలయానికి తరలించి ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు మృతుని భార్య రాజేశ్వరికి ఉద్యోగం ఇప్పించేలా చూస్తానని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, మృతుని బంధువులు, కార్మికులు

వాహనాలపైనే రేషన్ పంపిణీ చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన 38వ వార్డులో నిరసన

ప్రజాశక్తి - భీమవరం

రేషన్ పంపిణీ వాహనాలపైనే కొనసాగించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక 38వ వార్డు లంకపేటలో ఎండియు వ్యవస్థ రద్దును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ రేషన్ వాహనాల ద్వారా అవినీతి జరుగుతుందనే నెపంతో ప్రజలకు ఇంటి వద్దకు బియ్యం అందించకుండా డిపోల వద్దకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలనడం అన్యాయమన్నారు. వాహనాల ద్వారా అక్రమ రవాణా జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ సన్న బియ్యంతోపాటు కందిపప్పు, చింతపండు, నూనె, పంచదార తదితర నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, కుమారి, సాయమ్మ, రమేష్, మరియమ్మ పాల్గొన్నారు.



భీమవరంలో నిరసన తెలియజేస్తున్న నేతలు

భీమవరం టౌన్: రేషన్ వాహనాల నిలిపివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప గ్రామంలోని పెదపేటలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద రేషన్ వాహనాల నిలిపివేతను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో భూపతి సామ్యేలు, చిలకపాటి ఆనంద్‌కుమార్, ఇంజేటి సామ్యేలు, మంద చిట్టిబాబు, వర్ధనపు కన్నమ్మ దాసు, మంద మార్తమ్మ, ఉండేటి కుమారి, వర్ధన్నపు పండు, కాటికి వసంతరావు, పెద్దిరాజు, మంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వాహనాల రద్దుపై పునరాలోచించాలి

సిపిఎం ఆధ్వర్యాన ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - వీరవాసరం

ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే వ్యవస్థ రద్దు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ ఆధ్వర్యాన శుక్రవారం మండల కేంద్రం వీరవాసరంలో ప్రజాభిప్రాయం సేకరణ చేపట్టారు. పలువురిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహారాజు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, వివిధ రంగాల కార్మికులు ఇళ్లకే రేషన్ అందజేయడం వల్ల సౌకర్యంగా ఉందని తెలిపారన్నారు. రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలంటే గంట కొలదీ వేచిచూడాల్సి వస్తుందన్నారు. ఇంటి వద్దకే సరుకులు అందజేస్తే సకాలంలో కూలి పనులకు వెళ్లేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఎక్కడో తప్పు జరిగిందని మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం సరికాదన్నారు. మరింత పారదర్శకంగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేయాలన్నారు. మండలవ్యాప్తంగా ప్రజాభిప్రాయం తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యండమూరి సుబ్బారావు, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.



వీరవాసరంలో ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న సిపిఎం బృందం

రేషన్ వాహనాల రద్దును ఉపసహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండియు వ్యవస్థను రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు డోకల లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం ఏరియా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ నిర్వహణా లోపాలు సరిదిద్ది, ఎండియు వ్యవస్థను మరింత మెరుగుపర్చాలన్నారు. పూర్తిస్థాయిలో రద్దు చేయడం రేషన్ పేదలకు అందకుండా చేయడమేనన్నారు. తెలంగాణలో ఇచ్చినట్లు సన్న బియ్యం ఇక్కడ కూడా ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో వాగ్దానం మేరకు మంచి నూనె, కందిపప్పు, చింతపండు తదితర వస్తువులు ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, ఎస్.ఉదయకుమారి, సాకా సికిందర్, బి.రాంబాబు, బి.కళ్యాణి, బివి.వర్మ, గేదెల ధనుష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాలన్

ఉపాధి హామీ కార్మికులకు రూ.600 వేతనం ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.జార్జి

ప్రజాశక్తి - యలమంచిలి

గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వడ్డిలంక, మట్లపాలెం, నార్నిమెరక గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం బృందం పరిశీలించింది. కార్మికుల సమస్యలను నేతలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ రోజురోజుకీ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను దృష్టిలో పెట్టుకుని కార్మికులకు కొలతలతో సంబంధం లేకుండా రూ.600 వేతనం ఇవ్వాలని, ప్రతి కుటుంబానికీ 200 రోజులు పనులు కల్పించాలని, కార్మికులు పనిచేసే చోట టెంట్, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాసవరపు సుబ్బారావు, కానేటి బాలరాజు, దేవ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉపాధి హామీ వేతన బకాయిలు వెంటనే ఇప్పించాలని కూలీలు కోరారు. ఉపాధి పనుల పర్యటనలో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు శుక్రవారం రామన్నగూడెం, జగ్గన్నపేట గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఆరు, ఏడు వారాలుగా పని చేస్తున్నా కూలి సొమ్ము రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సోమరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం, ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు, నాలుగు నెలలు జీతాలు ఇవ్వకపోవడం దీనిలో భాగమేనన్నారు. తక్షణమే కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



యలమంచిలి : కార్మికులతో మాట్లాడుతున్న బాతిరెడ్డి జార్జి

వైసిపి తప్పిదాలే రైతులకు శాపాలు

మంత్రి రామానాయుడు

గోరింటాడలో రూ.12 లక్షలతో మైనర్ డ్రెయిన్ తవ్వకం పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వైసిపి ఐదేళ్ల పాలనలో చేసిన తప్పిందాలే నేడు రైతులకు శాపాలుగా మారాయని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. గోరింటాడలో రూ.12 లక్షలతో గోరింటాడ మైనర్ డ్రెయిన్ తవ్వకం పనులను కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి రైతులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో స్వాగతం పలికారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పని చేస్తుందని, రైతులకు అవసరమైన కాలవల పనులను పెద్దఎత్తున చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మండెల పావని నాని, తహశీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, ఎఇ శ్రీనివాస్, ఎంపిటిసి మామిడిశెట్టి లలితకుమారి, నేతలు పాముల రజనీకుమార్, కోడి విజయభాస్కర్, మండెల త్రిమూర్తులు, అందికోటి వీరభద్రం, నెక్కంటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



గోరింటాడ మైనర్ డ్రెయిన్ తవ్వకం పనులను ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో భాగంగా జూన్ 21వ తేదీన నిర్వహించబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్ క్రీడా మైదానంలో 500 మంది వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, పట్టణ, ప్రముఖులు, విద్యార్థులతో యోగా ప్రాక్టీస్ సెషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 19వ తేదీన స్థానిక డిఎన్ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 5 వేల మందితో భారీ యోగా ప్రాక్టీసు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలో యోగాంధ్ర మాసోత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులకు జెసి దిశానిర్దేశం చేశారు. జూన్ 21న విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగే యోగా దినోత్సవ వేడుకల్లో జిల్లాలోని ప్రజలందరూ భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. జిల్లా ఆయుష్ విభాగ అధికారి ఎ.హరిశ్రీనివాసు, ఆయుష్ కో- ఆర్డినేటర్ ఎ.శ్రీరామ్, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా టూరిజం అధికారి ఎవి.అప్పారావు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత : డిఆర్ఒ

యోగాతో మానసిక ప్రశాంత లభిస్తుందని డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కళా కేంద్రంలో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.



యోగా చేస్తున్న డిఆర్ఒ



సిఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆదిప్రసాద్

గూడెం సిఐగా ఆదిప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బోణం ఆది ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు స్పెషల్ బ్రాంచి సిఐగా పనిచేస్తూ బదిలీపై తాడేపల్లిగూడెం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ సిఐగా పనిచేసిన ఎ.సుబ్రహ్మణ్యం భీమవరం విఆర్‌కు బదిలీపై వెళ్లారు. తాడేపల్లిగూడెం పట్టణంలో శాంతి భద్రతలకు తగిన చర్యలు తీసుకుంటానని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

ముత్యాలమ్మ జాతరకు సహకరించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మొగల్తూరు

బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విప్ బొమ్మిడి నాయకర్ సూచించారు. జూన్ 9వ తేదీన బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు ఏర్పాట్లపై ఆర్‌డిఒ దాసిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ముత్యాలపల్లిలోని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు, కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మవారి జాతరకు అన్ని శాఖల అధికారులూ కృషి చేయాలన్నారు. అమ్మవారి జాతరను మూడేళ్లకోసారి నిర్వహిస్తారని, ఈ జాతరలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి యాత్రికులు భారీగా తరలి వస్తారన్నారు. అమ్మవారి జాతరకు ఈ ఏడాది లక్ష మంది దాటి వస్తారని అంచనావేస్తున్నారని, అందుకునుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతరను పురస్కరించుకుని గతంలో అల్లర్లుకు పాల్పడ్డవారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారిని ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేస్తే తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరను పురస్కరించుకుని మద్యం నియంత్రణపై చర్యలు తీసుకోవాలని, సమయ పాలన పాటించేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జాతర ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.సూర్యప్రకాష్, డిఎస్‌పి శ్రీవేద, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఇఒలు మోకా అరుణకుమార్, డి.రామకృష్ణంరాజు, తోట శ్రీనివాస్, తహశీల్దార్ కె.రాజకిశోర్, ఎంపిడిఒ త్రిశూలపాణి పాల్గొన్నారు.


జిన్నూరులో హెల్ప్ లైన్ ప్రారంభించిన రామభద్రం

ఉపాధ్యాయ బదిలీలకు హెల్ప్‌డెస్క్

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఉపాధ్యాయుల సౌకర్యార్థం యుటిఎఫ్ పోడూరు మండల శాఖ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌ను జిన్నూరు బ్రిడ్జి సెంటర్ వద్ద గురువారం ఏర్పాటు చేశారు. దీన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎవిబి.రామభద్రం ప్రారంభించారు. ఉపాధ్యాయులు తమ అప్లికేషన్లు సబ్మిట్, ఆన్‌లైన్ ఆప్షన్స్ సంఘం ఆధ్వర్యంలో చేయడం, బదిలీలకు సంబంధించి సమస్యల పరిష్కారంలో సహాయ సహకారాలు ఇక్కడ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు డి.క్షేమమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు, ఉపాధ్యాయులు సిహెచ్.త్రినాథ్, డివివి.ప్రసాద్, సిహెచ్.కరుణకుమారి, కె.చిరంజీవి పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటిద్దామని, దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులను అరికడదామని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం పట్టణ ఆరోగ్య కేంద్రం కడ కట్ల పరిధిలోని 33, 34, 35వ వార్డుల్లో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్‌పై అవగాహన కార్యక్రమాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా దోమల వచ్చే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని పిలుపునిచ్చారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారమూ డ్రైడే నిర్వహించాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి రాజేశ్వరి, దుర్గాదేవి, చినపాప, ఆశా వర్కర్ లక్ష్మీదుర్గ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

దేశాలమ్మ సన్నిధిలో మంత్రి నిమ్మల


ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లాకు దిగువ ఉన్న దేశాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనను ఆలయ కమిటీ వారు సత్కరించి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు మంత్రికి అందజేశారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి - తణుకు

మేలో జరిగిన ఎన్‌సిసి మాన్యువల్ ట్రెయినింగ్ క్యాంపు ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకూ నరసాపురం స్వర్ణాంధ్ర కాలేజీలో నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర) కు చెందిన విద్యార్థులు బెస్ట్ గన్ ఫైరర్‌గా టి.నందేశ్, బెస్ట్ డ్రిల్ స్టూడెంట్‌గా ఎన్.కుప్లేశ్వర్‌కుమార్, బెస్ట్ రన్నింగ్ రేసర్‌గా బివిఎస్ఎస్ గణేష్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు. ఎన్‌సిసి అసోసియేషన్, నేవీ ఆఫీసర్ చీలి రాజు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

తిరుమల విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భారతదేశం శాంతి దేశమని, యుద్ధాలతో ఇతర దేశాలు రెచ్చగొడితే సహించేది లేదని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం భీమవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులతో ఉగ్రవాదం నశించాలి.. భారత్ మాతకు జై అంటూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. డైరెక్టర్ వర్మ, సాయి రాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి ర్యాలీ చేపట్టారు.

గర్భిణులు ఆహారంలో జాగ్రత్తలు పాటించాలి

భీమవరం టౌన్: గర్భిణులు ఆహార విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, పోషక విలువలు గల ఆహార పదార్థాలను తీసుకోవాలని భీమవరం ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్ట్ సుబ్బలక్ష్మి అన్నారు. శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భీమవరం శాఖ సౌజన్యంతో భీమవరం ఏరియా ఆసుపత్రిలోని గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ప్రతి శుక్రవారమూ దాతల సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో కోడి గుడ్లు, ఆకుకూరలు, అరటి, మామిడి పళ్లు, బెల్లం అచ్చులను 54 మంది గర్భిణులకు అందించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.గోవింద్‌బాబు, రాజశేఖర్, పి.రామభద్రిరాజు, మల్లేశ్వరరావు, గోపిశెట్టి మురళీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కట్టుపాలెం మాజీ సర్పంచి వీరభద్రరావు మృతి

పలువురు సంతాపం

యలమంచిలి: సిపిఎం సానుభూతిపరుడు, కట్టుపాలెం గ్రామ మాజీ సర్పంచి జెట్టి వీరభద్రరావు (75) మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరభద్రరావు సిపిఎం తరపున కట్టుపాలెం గ్రామానికి 2000 - 2005 వరకూ ఐదు సంవత్సరాలు సర్పంచిగా పనిచేయగా, 2005-2010 వరకూ ఆయన భార్య వరలక్ష్మి సిపిఎం తరుపున గ్రామ సర్పంచులుగా పని చేశారు. అప్పటి ఆచంట ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ సహాయ సహకారాలతో సిపిఎం నాయకత్వాన గ్రామంలో తాగునీరు, కరెంటు, స్కూల్ బిల్డింగ్స్, పంచాయతీ కార్యాలయ నిర్మాణాలను చేపట్టడంతోపాటు ప్రజలందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడంతో కట్టుపాలెంలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. అందరికీ ఎంతో మేలు చేసిన వీరభద్రరావు ఆకస్మిక మృతికి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


వీరభద్రరావు (ఫైల్‌ఫోటో)

మద్యం విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

తణుకు: మద్యం షాపుల యాజమానులు సమయపాలనతో పాటు విక్రయ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ రాత్రి నిర్దేశించిన సమయంలో మద్యం షాపులు మూసివేసేలా, నిర్ణీత సమయానికి కంటే ముందుగా మద్యం షాపులు తీయకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి మద్యం షాపునకూ ఒక కానిస్టేబుల్, లేదా హెడ్ కానిస్టేబుల్‌ను బాధ్యులను చేశామని తెలిపారు. మద్యం షాపుల్లో వినియోగదారులకు అందించే మద్యం నాణ్యతను నిరంతరం పరిశీలించడం జరుగుతుందని, దీనిలో భాగంగా ప్రతి నెలా ప్రతి షాపు నుంచీ మద్యం బాటిల్ శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించి పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

నిలిచిన పనులు.. ఎప్పుడు పూర్తయ్యేనో మరి..!

వాహనదారులు, ప్రయాణికుల అవస్థలు


గొల్లగూడెంలోని రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు నుంచి భీమవరం గ్రామీణ మండలం వెంప వెళ్లే ఆర్ అండ్ బి రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణం చేస్తున్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మొగల్తూరు నుంచి కొత్తపాలెం వరకూ సుమారు ఆరు కిలోమీటర్లు, భీమవరం గ్రామీణ మండలం పెదగరువు నరసాపురం, భీమవరం రోడ్డు వరకూ సుమారు మూడు కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారిని అభివృద్ధి చేసేందుకు సుమారు ఏడేళ్ల కిందట ప్రభుత్వం రూ.12.64 కోట్లు నిధులు మంజూరు చేసింది. టెండర్లు పిలిచి నిర్మాణ బాధ్యతలను గుత్తేదారుకు అప్పగించారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం..

గత ప్రభుత్వ విధానాలతో నిర్మాణ పనులు పూర్తి కావడానికి జాప్యం చోటుచేసుకుంది. గుత్తేదారు చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరగడం, దీనికితోడు కరోనా ప్రభావంతో గుత్తేదారు సంస్థ యజమాని మృతి చెందడంతో రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దీంతో రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి మడుగులను తలపిస్తున్నాయి. ఆరు నెలలుగా రహదారులు, భవనాల శాఖ డిఇ కిరణ్ కుమార్ గుత్తేదారు సంస్థ ప్రతినిధులు నిర్మాణ పనులు తిరిగి చేపట్టేలా చర్యలు చేపట్టారు. దీంతో నిర్మాణం పూర్తవుతుందని ప్రజలు ఆశించారు. దీనికి భిన్నంగా పనులు ప్రారంభం కాలేదు. అలాగే నివాసప్రాంతాల్లో సిమెంటు రోడ్డు, మిగిలిన ప్రాంతాల్లో తారు రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇటీవల వాహన రద్దీతో రహదారిపై రాళ్లు పైకి లేచాయి. దీంతో దుమ్ము లేచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వెనక వెళ్లే ప్రజలకు కళ్లల్లో ఇసుక పడి ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు కొద్దిపాటి వర్షం కురిసినా రహదారి బురదగా మారుతోంది. దీనిపై రహదారులు, భవనాల శాఖ డిఇ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా తొందరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతానన్నారు.


మొగల్తూరు- వెంపు రహదారిపై లేచిన దుమ్ము

రవాణా రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - తణుకు

రవాణా రంగాన్ని ఆదుకునే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గ్రీన్‌టాక్స్ తగ్గించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసిన వాహనదారులు శుక్రవారం ఎంఎల్ఎను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెంచిన గ్రీన్ టాక్స్ తగ్గించే విధంగా చంద్రబాబునాయుడు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.8 వేల నుంచి రూ.18 వేల వరకూ గ్రీన్ టాక్స్ పెంచారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.1,500 నుంచి రూ.మూడు వేల వరకూ చెల్లించే విధంగా మార్పులు చేసిందన్నారు. రవాణా రంగాన్ని ఆదుకునే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకుంటున్న చర్యల పట్ల వాహనదారులు కృతజ్ఞతా భావంతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో లారీ యజమానులు, కూటమి నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలుపుతున్న వాహనదారులు

రైతులకు మేలు చేయడమే కూటమి లక్ష్యం

సబ్సిడీపై పశువుల దాణా సరఫరా చేసిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల పథకాలనూ అందిస్తుందని, పాడి రైతులకు సబ్సిడీపై దాణా సరఫరా చేస్తోందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం తాడేరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వం సబ్సిడీపై పశువుల దాణా సరఫరా కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. రాయితీపై పశువుల దాణా రైతులకు అందించి వారిలో ధీమా కలిగిస్తున్నామని, పశువుల ఆరోగ్యం, ఉత్పత్తిని కాపాడటానికి రాయితీపై పశువులకు నాణ్యమైన సమీకృత దాణా సరఫరా చేస్తున్నామన్నారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన పాడి రైతులకు 50 శాతం రాయితీ అందిస్తున్నామన్నారు. 50 కిలోల దాణా సంచి రూ.1,110 అని, 50 శాతం రాయితీతో రూ.555 రైతులు చెల్లించాలన్నారు. ప్రస్తుతం భీమవరం మండలంలో వెయ్యి మంది రైతులకు ఈ రాయితీని అందిస్తున్నారని, మొదటి విడతగా 250 మందికి నాలుగు విడతలుగా 1000 మందికి పశువుల సరఫరా చేస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాడి రైతులకు పశువుల దాణా అందజేశారు. కార్యక్రమంలో తాడేరు గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రైతులకు దాణా అందజేస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

బకాయి వేతనాలు చెల్లించాలి

ఆసుపత్రి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తణుకు

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల నాలుగు నెలల వేతన బకాయిలు, 36 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయికనుగుణంగా కనీసం 50 మందికి తగ్గకుండా పారిశుధ్య కార్మికులను నియమించి కార్మికుల పనిభారం తొలగించాలని ఎపి మెడికల్ కాంటాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఎపి మెడికల్ కాంటాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.కృపావరానికి అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలే నెలా నెలా సక్రమంగా ఇవ్వకపోవడంతో పస్తులతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పిఎఫ్ సొమ్ము సైతం కార్మికుల పిఎఫ్ ఖాతాలకు జమ చేయడం లేదన్నారు. తక్షణం ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించి వారి న్యాయమైన డిమాండ్స్ పరిష్కారించాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, నేకూరి లక్ష్మీ, పి.విజయలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, రేణుక, హైమావతి, యు.లక్ష్మి, ఎం.బేబీ, డి.చిన్న పాల్గొన్నారు.

కాలువ ప్రక్షాళనకు చర్యలు : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి పాలనలో పంట, మురుగు కాలువల ప్రక్షాళన పనులను పూర్తిగా మరిచిపోయి రైతులను నిండా ముంచేశారని, ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం పంట, మురుగు కాలువల ప్రక్షాళనకు చర్యలు చేపట్టిందని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని సరిపల్లి మీడియం డ్రెయిన్ పూడికతీత పనులకు, చినమామిడిపల్లి జాతీయ రహదారి వంతెన వద్ద మురుగు కాలువకు షట్టర్లు ఏర్పాటు అదే ప్రాంతంలో అండర్ టన్నెల్ కింద మేట వేసిన మట్టి తొలగింపు వంటి రూ.52 లక్షల వ్యయంతో చేపట్టే పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. సరిపల్లిలో మురుగు కాలువ పూడిక తీత పనులు ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌తో కలిసి ప్రొక్లయినర్‌తో పూడిక తీసే పనులను ప్రారంభించారు. సరిపల్లి డ్రెయిన్ పరిధిలో మురుగు కాలువలు పూడిపోవడం వల్ల గత ఆరేళ్లుగా ఖరీఫ్ పంట ముంపు బారిన పడి పంట కోల్పోతున్నామని సరిపల్లి గ్రామ సర్పంచి ఈదా సురేష్ బాబు, రైతులు బట్టు నాగేశ్వరరావు, బట్టు నెహ్రూ, గంధం సత్యనారాయణ, రేకపల్లి సురేష్, దాయం బంగారు కొండ తదితరులు మంత్రి రామానాయుడు, ఎంఎల్ఎ నాయకర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఏటా ముంపు సమస్యతో రైతులు ఏటా పంట కోల్పోయి పడుతున్న ఇబ్బందులను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మంత్రి రామానాయుడుకు వివరించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ గుబ్బల మర్రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు అందే రామకృష్ణ పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కడపలో మహానాడును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. టిడిపి కార్యకర్తలు పండుగలా భావించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 24న తణుకులో జిల్లా మహానాడు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తణుకులోని భాగవల్లి బాపయ్య కమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి టిడిపి నాయకులు పాల్గొనే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కడపలో ఎంతో ఉత్సాహభరితంగా జరుపుకునే కార్యక్రమంలో భాగంగా తణుకులోను నిర్వహించే జిల్లా మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎపి ఐసెట్ ఫలితాల్లో శ్రీసూర్య విద్యార్థుల హవా

ప్రజాశక్తి - నరసాపురం

ఎపి ఐసిఇటి 2025 ఫలితాల్లో శ్రీసూర్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ ర్యాంకుల ఆధారంగా ఉన్నత యూనివర్సిటీల్లో ఎంసిఎ చదివేందుకు అర్హత సాధించారు. ఫలితాలు విడుదల సందర్భంగా శ్రీసూర్య కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాంకు సాధించిన వారిలో రావూరి పూర్ణ సత్య లక్ష్మీదేవి 2504, అడ్డాల మానస నందిని 2515, సత్తినేని సత్య శిరీష 4044 ర్యాంకులతో పాటుగా కొండేటి బాల నందు, జొన్నల సాయికుమారి, వీర జాహ్నవి, అడ్డాల నీలిమ దివ్య, దాసిరెడ్డి హర్షిత, కందులపాటి సాయి సిరి, పోలిశెట్టి దినీషా, అనిశెట్టి మేఘన, చామకూరి సంధ్య, ముచ్చర్ల లక్ష్మీ రూప, అడిదల భార్గవి ఉత్తమ ర్యాంకులు సాధించారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ ఘంటసాల బ్రహ్మాజీ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.పుల్లారావు, అకడమిక్ ప్రిన్సిపల్ టి.కృష్ణ గుప్తా, అధ్యాపకులు డాక్టర్ ఎఆర్ఎస్.కుమార్, బి.రామచంద్ర రెడ్డి, డాక్టర్ ఫాజల్, డాక్టర్ కె.జానకిరామ్, ఆర్.సతీష్, వేణుగోపాల్, సిహెచ్ కరుణకుమార్, కేశవ, సత్య, రామకృష్ణ, మహేశ్వరితోపాటు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆక్రమణల నుంచి నడకదారిని కాపాడండి

ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

వడలి గ్రామంలో ఏళ్ల తరబడి ఉన్న నడకదారి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని ఆ గ్రామస్తులు పలువురు ఎంపిడిఒ టి.సూర్యనారాయణమూర్తికి శుక్రవారం వినతిపత్రం అందించారు. మందాలమ్మ గుడి పక్క నుంచి వెళ్లే నడకదారిని మూసివేసి వేరే మార్గంలో వెళ్లాలనడం సరికాదని పేర్కొన్నారు. తక్షణం అధికారులు జోక్యం చేసుకుని నడకదారి కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుంచే కృపారావు, చిటికెన చిన్న బ్రహ్మయ్య, బయ్యే వీర్రాజు, రాయవరపు వెంకటరమణారావు, దొండ శ్రీను, చిటికెన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో యోగా

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం యోగా కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన యోగా మాసోత్సవాల్లో భాగంగా యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.రాజుకిషోర్, ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాని, మండలస్థాయి అధికారులు, పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువు మానేసిన కిశోర బాలికలు ఓపెన్ స్కూళ్లలో చేరాలి

పెనుమంట్ర: అనేక సమస్యల వల్ల మధ్యలో పాఠశాల విద్యను మానేసిన కిశోర బాలికలు ఓపెన్ స్కూళ్లలో చేరి జీవితంలో ఎదగాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం కిశోర వికాసం వేసవి కాల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని పంపనవారిపాలెం, సత్యవరం, వివిపాలెంలో విద్య, ఓపెన్ స్కూల్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రాజెక్టులోని సూపర్‌వైజర్‌లు ఎస్.వెంకట లక్ష్మి, టి.పోశమ్మ, పి.వరలక్ష్మి, జిఎం.కుసుమ, తనూజ, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.